క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం : నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెందుర్తి ఏఈ ఎస్.శ్యామ్‌సుందర్ తెలిపారు. వెలంపేట, అనకాపల్లి రోడ్డు, కొత్తవలస రోడ్డు మొత్తం ఏరియా, సాయినగర్, ఎల్‌ఐసీ కాలనీ, పాత పెందుర్తి, రాతిచెరువు, నూకాలమ్మ ఆలయం ఏరియా, ఆదిత్యనగర్, లక్ష్మీనగర్, ప్రగతి నగర్, వీవీఎస్ సుందర్ నగర్, డీఆర్‌సీ మాల్ ఏరియా, కాటా ఏరియా, మహిళా ప్రగతి కేంద్రం ఏరియా, శాంతి కల్యాణమండపం ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలంతా సహకరించాలని కోరారు.

త్వరితగతిన రహదారి మరమ్మతులు



ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : పెందుర్తి నియోజకవర్గంలో ఆర్ అండ్‌బీ పరిధిలోని రోడ్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశించారు. రాంపురంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్ల దుస్థితిని వారి దృష్టికి తీసుకెళ్లారు. పలుచోట్ల రోడ్లన్నీ మరమ్మతులకు గురై ప్రజలు రాకపోకలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. ఆయా రోడ్లను అభివృద్ధి చేయాలని సూచించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ సత్యఫణీశ్వర్, ఏఈ ఉదయ్ పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి



వెన్నలపాలెంలో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పరవాడ: గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే చర్యలను ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వెన్నలపాలెంలో సమస్యల పరిష్కారం కోసం ఉపాధి కూలీలు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్రం బడ్జెట్లో ఏడాదికి రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏడాదికి ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించి రోజుకి రూ.600 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మర్ అలవెన్స్, పరికరాలు, చెరువుల వద్ద మౌలిక సదుపాయాలు, మెడికల్ కిట్లను ఏర్పాటు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

200 మందికి వైద్య సేవలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సబ్బవరం: మండలంలోని గొటివాడ బీసీ కాలనీలో తగరపువలసలోని అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీడీవో రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గొటివాడ సర్పంచ్ సాలాపు మీనా మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలిక వ్యాధులున్నవారిని, శస్త్ర చికిత్సలు అవసరమైనవారిని గుర్తించి ఆస్పత్రిలో ఉచిత వైద్య అందిస్తారన్నారు. మాజీ సర్పంచ్ సాలాపు వెంకటేశ్వరరావు, ఆస్పత్రి టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణ, గ్రామ సచివాలయ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలతో పేదల బతుకుల్లో వెలుగు



లగిశెట్టిపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సురేష్



రావలమ్మపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సబ్బవరపు నారాయణమూర్తి తదితరులు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మండలంలోని ఆరిపాక సచివాలయం పరిధిలోని లగిశెట్టి పాలెం గ్రామంలో వైఎస్సార్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ ఆధ్వర్యంలో గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత చేపట్టిన సంక్షేమ పాలన వివరించారు. ఇంటి యజమాని అనుమతి మేరకు జగనన్న స్టిక్కర్లను అతికించి, వారికి జగన్ మోహన్‌రెడ్డి సందేశాన్ని వినిపించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి తమ మద్దతును తెలియజేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అంతకాపల్లి సచివాలయం పరిధిలోని అంతకాపల్లి, రావలమ్మ పాలెం గ్రామాల్లో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్బవరపు నారాయణమూర్తి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, సచివాలయ కన్వీనర్ గొర్లి నాయుడు, వార్డు సభ్యులు గొంప వరలక్ష్మి, కొల్లి దాసు, సబ్బవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

96వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగాను, అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 96వవార్డు 514 సచివాలయం పరిధి అంబేడ్కర్‌నగర్, మహాలక్ష్మినగర్‌లో ఎమ్మెల్యే గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమపథకాలు అందుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమపథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రాము నాయుడు, లెక్కల రమేష్, సరగడం నరసింహమూర్తి, లెక్కల వేణు, మెంటి ప్రసాద్, మాధవరావు, వర్క్స్ ఏఈ రాజశేఖర్, ఎలక్ట్రికల్ ఏఈ రవి, సచివాలయం సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

సక్రమంగా జగనన్న కిట్లు అందజేయాలి



మాట్లాడుతున్న జ్యోతికుమారి

సింహాచలం : ఈనెల 15వతేదీ నుంచి మే 31వ తేదీ వరకు ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యాకానుక కిట్లను స్టాక్‌పాయింట్లలో భద్రపరిచి ఆయా స్కూళ్లకు పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని రాష్ట్ర అబ్జర్వర్ ఆర్‌జేడీ జ్యోతి కుమారి మండల అధికారులకు సూచించారు. పెందుర్తి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గురువారం ఎమ్‌ఈవో, వెలుగు ఏపీఎం, మండల నాడు–నేడు ఇంజినీరు, సీఆర్పీలు, పీటీఐలు, ఎంఆర్‌సీ సిబ్బందితో జ్యోతికుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 15నుంచి మే 31వరకు ప్రభుత్వం సరఫరా చేసే జేవీకే కిట్లు తీసుకోవడం, స్టాక్ పాయింట్‌లో భద్రపరచడం, స్కూళ్లకు ఆ కిట్లు చేరవేయడం అంశాలపై అవగాహన కల్పించారు. ఎక్కడా ఎటువంటి లోపాలు తలెత్తకుండా విద్యార్థులకు సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీబీ శ్రీనివాసరావు, సీఎంవో శిరీష, జీసీడీవో బేగం, ఏంఈవో పైడపునాయుడు, వెలుగు ఏపీఎం బి.వెంకటరమణ, మండల నాడు–నేడు ఇంజినీర్ పి.పద్మ, ఎంఆర్సీ సిబ్బంది గుప్తా, అకౌంటెంట్ కృష్ణమూర్తి, సీర్పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

దేవీపురంలో శ్రీవిద్య ఉపాసనా తరగతులు



శ్రీవిద్యా ఉపాసనా తరగతులలో సాధన చేస్తున్న విదేశీ అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో శ్రీవిధ్యా ఉపాసనా తరగతులను గురువారం ప్రారంభించారు. దేశ విదేశాలకు చెందిన సుమారు 12 మంది విద్యార్థులు ఆంగ్ల భాషా ప్రామాణికంతో ఈ శ్రీవిధ్యా ఉపాసనా తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ నెల 17వ వరకూ తరగతులు జరుగుతాయి. గురువారం శిక్షణ తరగతులను గురుమాత అన్నపూర్ణమ్మ జ్యోతి ప్రారంభించారు. వీరికి ఆచార్యులగా మూర్తి రాధ, కందర్ప రమ వ్యవహరించనున్నట్లు తెలియజేసారు. శిక్షణ తరగతులలో జర్మనీ నుంచి వో మేరీస్ మిచల్, వై డిమోట్స్ పెర్నాడ్స్ బటన్‌బర్గ, బెంగళూర్ నుంచి కె.వనజ, మైసూర్ నుంచి ఎల్ అను, రిషికేష్ నుంచి ఎం.సుచిత్ర, ఆగ్రా నుంచి దవేంద్ర శర్మ, ముంబై నుంచి మమతా, విశాఖ నుంచి మోపిదేవి పూజ, విజయవాడ నుంచి వి.సురేష్ కుమార్, హైదరాబాద్ నుంచి చెరుకూరి ఉదయ్ శంకర్, నాగపూర్ నుంచి ఎస్.అపూర్వ, న్యూ ఢిల్లీ నుంచి సీహెచ్ అలీనలు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవలో 24 మంది, శ్రీచక్రా నవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటుటున్న తహసీల్దార్ సత్యనారాయణ,ఎంపీడీవో రమేష్ నాయుడు



పోటీలో దౌడు తీస్తున్న గుర్రం

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామ ప్రజల ఆరాధ్య దేవత శ్రీబంగారమ్మ అమ్మవారి పండగ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. అమ్మవారిని తహసీల్దార్ బి.సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన గుర్రం పందాల పోటీలు ఆకట్టుకున్నాయి. రాత్రికి నిర్వహించిన రేలారే రేలా డ్యాన్స్ కనువిందు చేసింది.

శరవేగంగా రోడ్డు పనులు



లంకానగర్‌కు వెళ్లే రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సింహాచలం : 93వ వార్డు 419 సచివాలయం పరిధిలోని విరాట్‌నగర్ సమీపంలో ఉన్న లంకానగర్‌లో రోడ్డు మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల 491 సచివాలయం పరిధిలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించగా సంబంధిత రోడ్డు విషయాన్ని నిర్వాసితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గడపగడపకు మన ప్రభుత్వం పూర్తికాగానే వచ్చే నిధులతో ప్రాధాన్యత క్రమంలో లంకా రోడ్డు పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు రూ.3.46లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను గురువారం ప్రారంభించారు. 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు సంబంధిత పనులను పరిశీలించారు. శరవేగంగా రోడ్డు పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి.అప్పలరాజు, సూరిబాబు, సంతోష్, హర్ష, దొరబాబు పాల్గొన్నారు.

అందరివాడు.. అంబేడ్కర్

- తమ ఆలోచనలు పంచుకున్న విద్యార్థులు
- రాజ్యాంగ నిర్మాతను విభిన్న కోణాల్లో ఆవిష్కరణ



డిబేట్‌లో పాల్గొన్న ఏయూ కళాశాలల విద్యార్థులు

ఏయూ క్యాంపస్: రాజ్యాంగ నిర్మాత, ఆర్థికవేత్త, న్యాయకోవిదుడు ఇలా విభిన్న రంగాలో అంబేడ్కర్‌ది అందేవేసిన చేయి అని ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్‌స్టీఫెన్ అన్నారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం అమెరికన్ కార్నర్‌లో ఏయూ క్యాంపస్ కళాశాలల విద్యార్థులతో డిబేట్ నిర్వహించారు. 'హూ ఓన్స్ అంబేడ్కర్'(అంబేడ్కర్ ఎవరికి చెందుతారు) అనే అంశంపై విద్యార్థులు తమ భావాలను స్వేచ్ఛగా పంచుకున్నారు. విద్యార్థుల భావాలు, ఆలోచనలు వారి మాటల్లో..

ప్రాజెక్టుల నిర్మాణంలో విశేష కృషి



దేశాభివృద్ధికి నీటి వనరుల లభ్యత, అవసరాన్ని అంబేడ్కర్ గుర్తించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ పాలసీని ఆయన తీసుకువచ్చారు. వ్యవసాయానికి అవసరమైన నీటి విభజన, అనేక ఇరిగేషన్ ప్రాజెక్టుల రూపకల్పన అమలులో అంబేడ్కర్ ఆలోచనలు, కృషి ఉన్నాయి. దేశంలో ప్రముఖ ప్రాజెక్టుల నిర్మాణంలో ఆయన కృషి అపారం.

–కె.యతీంద్ర, జియో ఇంజినీరింగ్ విభాగం

దేశ అవసరాలు తీర్చే ఆలోచన..



దేశానికి అవసరమైన విద్యుత్ అవసరాలను తీర్చే దిశగా అంబేడ్కర్ పనిచేశారు. సెంట్రల్ టెక్నికల్ పవర్ బోర్డ్‌ను ఆయన ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా విద్యుద్దీకరణకు పాటుపడ్డారు. పవర్ డిస్ట్రిబ్యూషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఆయన చర్చించారు. హైడ్రో, థర్మల్ పవర్ ఉత్పత్తిని పెంచడానికి అంబేడ్కర్ చేసిన సేవలు అమోఘం.

–టి.అచ్యుత్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం

సమాజంలో వ్యత్యాసాలు రూపుమాపారు..



అంబేడ్కర్ సమాజంలో వ్యత్యాసాలు, అసమానతలను రూపుమాపడానికి కృషి చేశారు. ఆయన తీసుకువచ్చిన యూనిఫాం సివిల్ కోడ్ ఎంతో ఉదాత్త ఆశయంతో చేపట్టినది. ఇది మన కస్టమ్స్‌ని మార్చేస్తుందని అందరూ భావించారు. ఇది వాస్తవం కాదు.. కేవలం అసమానతలను రూపుమాపడానికి దీనిని తీసుకువచ్చారు. న్యాయ విద్యను బోధించడానికి అంబేడ్కర్ ఇష్టపడేవారు.

– డి.హర్షిత, న్యాయ కళాశాల విద్యార్థిని

అంబేడ్కర్ ఆలోచనలతో ఆర్‌బీఐ స్థాపన



దేశంలో ఆర్‌బీఐ స్థాపనకు అంబేడ్కర్ ఆలోచనలే కారణం. బ్రిటీష్ కాలంలో పన్ను వసూలు చేసే కోటి వ్యవస్థను రద్దు చేసి రైతులు, చేనేతకారులను రుణ విముక్తులను చేశారు. ఆర్థికంగా చితికిపోతున్న వారికి కోటి వ్యవస్థ రద్దు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. కేంద్రం, రాష్ట్రాలకు నిధుల విభజన అంబేడ్కర్ పీహెచ్‌డీ ఆధారంగా జరిగినదే.

– డి.శ్రావ్య, అర్థశాస్త్ర విభాగం విద్యార్థిని

హక్కులకు పరిరక్షకుడు



హక్కులను కల్పించడం ప్రతీ దేశ రాజ్యాంగం చేస్తుంది. హక్కులను పరిరక్షించడానికి సైతం ఒక హక్కును కల్పించిన దార్శినిక ఆలోచన కలిగిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. తన ఆలోచనలను ప్రతిబింబిస్తూ దేశానికి అవసరమైన బలమైన రాజ్యాంగాన్ని ఆయన అందించారు.

–వి.కల్యాణ రామారావు, న్యాయ కళాశాల విద్యార్థి

రాజ్యాధికారం సాధనతో సమస్యలకు పరిష్కారం



సమాజంలో అనేక సమస్యలకు రాజ్యాధికారం సాధనతో పరిష్కరించవచ్చునని అంబేడ్కర్ విశ్వసించారు. ఆయన రాజకీయ రంగంలో కూడా ప్రవేశించారు. రాజనీతి శాస్త్రవేత్తగానే కాకుండా నిజమైన రాజకీయ నాయకునిగా ఆయన విశేష సేవలు అందించారు.

–జి.శివకోటి, రాజనీతిశాస్త్ర విభాగం విద్యార్థి

సైన్స్ అందరికీ చేరువ కావాలి..



సైన్స్ అనేది ఒక బ్రహ్మపదార్థంగా ఉండకూడదని, అందరికీ చేరువ కావాలని అంబేడ్కర్ ఆశించారు. దీనిలో భాగంగా ఆర్టికల్ 51ఏ(హెచ్)ని ఆయన తీసుకువచ్చారు. అందరూ సమానమే, అందరికీ సమాన అవకాశాలు అందడం, శాస్త్రీయ ఫలాలు చేరువ కావడంపై ప్రత్యేక దృష్టిపెట్టి పనిచేశారు. – పి.శ్రావణి, కెమిస్ట్రీ విభాగం

అప్పన్నను దర్శించుకున్న సినీ నటుడు శ్రీకాంత్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సినీ నటుడు శ్రీకాంత్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం సినీ నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అప్పలనాయుడు అందజేశారు.

హస్త కళాకారులకు ప్రోత్సాహం

దాబాగార్డెన్స్: గ్రామీణ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను పట్టణాల్లో విక్రయించి, వారిని ప్రోత్సహించడమే నాబార్డ్ లక్ష్యంగా పనిచేస్తోందని నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ డీజీఎం కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నాబార్డ్ ఆర్థిక సహకారంతో నేస్తం సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఇన్ మాల్ పేరిట పట్టణాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి వాటిని అందుబాటు ధరలకే విక్రయిస్తున్నట్టు చెప్పారు. నగరంలోని ఓ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 12 వరకు హస్త కళాకారుల ఉత్పత్తుల విక్రయాలు జరుగుతాయని తెలిపారు. హస్త కళాకారులకు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా వసతి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. మహా విశాఖ ప్రజలు హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. నాబార్డ్ విశాఖ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు, నేస్తం ఎన్జీవో సంస్థ సురేష్ తదితరులు మాట్లాడారు.

మక్కా మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న డాక్టర్ జహీర్ అహ్మద్

దాబాగార్డెన్స్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ గురువారం జగదాంబ జంక్షన్ సమీపాన గల మక్కా మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ నెల రోజులు సూర్యోదయం నుంచి, సూర్యాస్తమయం వరకు కనీసం మంచినీళ్లు కూడా తాగకుండా ముస్లింలందరూ ఉపవాసం చేస్తారన్నారు. ఆ సమయంలో పవిత్రంగా ప్రార్థనలు చేస్తారని చెప్పారు. రంజాన్ ప్రారంభమైన 20వ రోజు రాత్రంతా మసీదులో దేవుడి ప్రార్థనలో గడుపుతారని, ఆ సందర్భంగా ఎవరైతే ఉపవాసం చేస్తారో ఆ సాయంత్రం ఉపవాసం ఉపహరించుకునే సమయమే ఇఫ్తార్ అంటారని పేర్కొన్నారు. 20వ రోజు సందర్భంగా వందలాది మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ చైర్మన్ మక్సూద్ అహ్మద్, డాక్టర్ ముస్తాక్ అహ్మద్, రిజ్వాన, తాజ్, ఎఫ్ఆర్ ఖాన్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్

బీచ్ రోడ్డు: సాగర తీరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏపీ అడిషనల్ డీజీపీ(అగ్నిమాపక) పి.వి.సునీల్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శమన్నారు. సమాజంలో అసమానతలను తొలగించడంలో అంబేడ్కర్ పాత్ర కీలకమైందన్నారు. అంబేడ్కర్‌ను ఒక్క వర్గానికే పరిమితం చేయడం తగదన్నారు. ఆయన అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, రొయ్యి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.